## డీఆర్సీ సెంటర్ పరిశీలన



డీఆర్సీ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా

మెదక్ అర్బన్, అక్టోబర్ 20 : ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పరిశీలించారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, ఇతర కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల సామగ్రి రవాణా, పార్కింగ్ సదుపాయాలతోపాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. ఎన్నికలు సాఫీగా జరిగేలా అన్ని వసతులు అందుబాటులో ఉండే లా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారి ఆదేశించారు. తనిఖీలో ఎన్నికల అధికారి వెంట ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ ఫణీందర్ ఉన్నారు.

## ఫుట్‌బాల్ క్రీడాకారులతో పునీత్‌రెడ్డి



వెస్లీ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్ క్రీడాకారులతో పునీత్‌రెడ్డి

మెదక్ అర్బన్, అక్టోబర్ 20 : జిల్లాకేంద్రంలోని వెస్లీ కళాశాల మైదానంలో జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తనయుడు పునీత్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు.



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఔరంగాబాద్ తండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు



మెదక్ అర్బన్ : బీఆర్ఎస్‌లో చేరిన గంగాపూర్ గ్రామస్తులతో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

# కాంగ్రెస్, బీజేపీ బేజారు..

- జిల్లాలో బీఆర్ఎస్ జోరు
- మెదక్‌లో పద్మక్క గెలుపు ఖరారు
- ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో 200 మంది చేరిక
- సర్దన గ్రామంలో గులాబీ జెండా

మెదక్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)/ మెదక్ అర్బన్ : మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జోరు ముందు కాంగ్రెస్, బీజేపీ బేజారవుతున్నాయి. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించడానికి కాంగ్రెస్, బీజేపీ నుంచి ఒకరు కాదు ఇద్దరు కాదు వందలాది మంది ఆయా పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. శుక్రవారం మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో హవేళీఘనపూర్ మండలంలోని సర్దన గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన కార్యదర్శి సంతోష్‌కుమార్, బీజేపీ బూత్ అధ్యక్షుడు పట్నం భువనేశ్వర్, కాంగ్రెస్ కార్యకర్త రామచంద్రాగౌడ్, గంగారం సహా పలువురు కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు. తనను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. 50 ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మెదక్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఎన్నికలు రాగానే అది చేస్తా.. ఇది చేస్తామని ప్రజలను మభ్యపెట్టి, ఓట్లేయించుకుని మోసం చేస్తున్నదని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి పథకాన్ని అధికారంలోకి రాగానే అమలు చేస్తారన్నారు. ఔరంగాబాద్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దేవలాల్, బీజేపీ నాయకుడు జయరాంతోపాటు తండాకు చెందిన గిరిజనులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మెదక్ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, హవేళీ ఘనపూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాణిక్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన గంగాపూర్ గ్రామస్తులు**

జిల్లాకేంద్రం మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో హవేళీఘనపూర్ మండలంలోని గంగాపూర్ గ్రామంలో సర్పంచ్ పద్మావెంకట్, ఎంపీటీసీ యాదాగౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి యువతకు గులాబీ కండువా కప్పి, బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తనయుడు పునీత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పోతుల రాజయ్య, సోషల్ మీడియా కన్వీనర్ రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు కావేరి సిద్దిరాములు, భూషణం, చిత్తారి, వార్డు సభ్యురాలు కావేరిఆంజనేయులు పాల్గొన్నారు.

## మెదక్ కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు

- బతుకమ్మ ఆడిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్, అక్టోబర్ 20 : పూలను పూజించే సంస్కృతి తెలంగాణ ప్రజలకే సొంతమని అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జెన్నారెడ్డి, శ్రీపతిరావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద ముఖ్య అతిథిగా హాజరై న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను ఇందిరాపురి కాలనీలోని చెరువులో నిమజ్జనం చేశారు. బతుకమ్మ సంబురాల్లో జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్, స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కల్పన, న్యాయవాదులు శారద, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

## ఎన్నికలకు సహకరించాలి

- మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిన తర్వాత ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూంలో భద్రపర్చాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు సయ్యద్ ఇష్రత్ (ఏఐఎంఐఎం), గౌస్ ఖురేషి (బీఆర్ఎస్), ఆంజనేయులుగౌడ్ (కాంగ్రెస్), కె.నర్సింహులు (బీఎస్పీ), బస్వరాజ్ (సీపీఎం), ఎండీ అఫ్జల్(టీడీపీ)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 4,34,900 మంది ఓటర్లున్నారని, వీరి కోసం 579 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 25శాతం, వీవీ ప్యాట్లు 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నియోజకవర్గం, పోలింగ్ కేంద్రాల వారీగా యంత్రాల కేటాయింపు పూర్తి చేస్తామన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు ఏఈవీఎం గోదాంలో నియోజకవర్గం వారీగా జనరేట్ చేసిన జాబితా ప్రకారం కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని తెలిపారు. రెండో దఫాలో ఎన్నిక అధికారులు, ఎన్నికల సహాయ అధికారులు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, మూడో ర్యాండమైజేషన్‌లో కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి సిద్ధం చేస్తామన్నారు. పోలింగ్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, వాహనాలు, సభలు, సమావేశాలు ఏర్పాట్లు, డబ్బు పంపిణీ సమాచారం తమకు అందించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య వార్తలపై అప్రమత్తం ఉండాలని, అభ్యంతరకర పోస్టులు ఉండరాదని హితవు పలికారు. సమావేశంలో ఎస్పీ రోహిణిప్రియదర్శిని, ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్‌కు సలామ్..

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- మెదక్ జిల్లాలో 14 మంది అమరవీరులు
- అమరుల కుటుంబాలకు సర్కారు అండ
- పోలీసుల త్యాగాలను స్మరిస్తూ 31వ తేదీ వరకు ఫ్లాగ్ డే కార్యక్రమాలు

మెదక్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం. 1959న లడఖ్ సరిహద్దుల్లో కాపలాగా ఉన్న పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. అమరులైన సైనికులతోపాటు విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను అక్టోబర్ 21న స్మరించుకుని, నివాళులర్పిస్తారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అనునిత్యం పోరాడుతున్నారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం. తీవ్రవాదం, అసాంఘిక శక్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు కొంత మంది పోలీసులు ప్రాణాలను త్యాగం చేశారు. అమరులను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్‌డే) నిర్వహిస్తున్నారు.

**మెదక్ జిల్లాలో 14 మంది అమరులు**

1999 సెప్టెంబర్ 13న మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో రాత్రివేళ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుళ్లు ప్రసాద్, రాంచందర్, నర్సింహులు, అబేద్ హుస్సేన్‌పై పీపుల్స్‌వార్ నక్సలైట్లు కాల్పులు జరిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆయుధాల కోసం వచ్చిన నక్సలైట్లు విధులు నిర్వర్తిస్తున్న వీరిని చంపి, పోలీస్‌స్టేషన్‌ను పేల్చివేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాలు ఎత్తుకెళ్లారు.

1991 ఏప్రిల్ 4న కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై దామోదర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మల్లేశం నక్సలైట్లపై దాడి చేయడానికి కౌడిపల్లి మండలం ధర్మాసాగర్ గ్రామానికి వెళ్లారు. అక్కడే కాపుకాసిన నక్సలైట్లు ఎస్సైతో పాటు హెడ్‌కానిస్టేబుల్‌ను కాల్చిచంపారు. 1997 నవంబర్ 11న శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో ఓ ఇంట్లో నక్సలైట్లు సమావేశం నిర్వహిస్తున్నారనే సమాచారంతో తూప్రాన్ డీఎస్పీ బాలసుబ్రమణ్యం, సీఐ వెంకటస్వామి, హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, శివ్వంపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్ రావు, లక్ష్మణ్‌నాయక్, సుజాయత్‌అలీ ఘటనా స్థలానికి వెళ్తుండగా పేలుడు పదార్థాలు పేలి అక్కడికక్కడే మృతి చెందారు. 1996 నవంబర్ 11న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాములు ఒక కేసులో నక్సలైట్‌ను మెదక్ నుంచి నిజామాబాద్ కోర్టుకు బస్సులో తీసుకెళ్తున్నాడు. బాన్సువాడ ప్రాంతంలో ఆర్టీసీ బస్సును అడ్డగించిన నక్సలైట్లు రాములును కాల్చిచంపారు.

**అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ..**

పోలీసు అమరవీరులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించారు. మెదక్ జిల్లాలో అమరులైన వారిలో డీఎస్పీ, సీఐ, ఎస్సైతోపాటు నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. అమరులైన పోలీసు కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలను కల్పించింది.

**నేటి నుంచి సంస్మరణ కార్యక్రమాలు**

పోలీస్ ఫ్లాగ్‌డే సందర్భంగా వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ రోహిణిప్రియదర్శిని తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈ నెల 21 నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (జాతీయ ఐక్యత దినోత్సవం) 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఓపెన్‌హౌస్ నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. https://forms.gle/b7bejvzfo6j29Vuz6 వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఎస్పీ రోహిణిప్రియదర్శిని వివరించారు.